క్లుప్తంగా

42మందికి ఉచితనేత్ర వైద్య పరీక్షలు



పెదపెంకిలో రోగులకు పరీక్షలు చేస్తున్న ఆప్థాలమిక్

బలిజిపేట: మండలంలోని పెదపెంకి సత్య సాయి మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 42మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాలమిక్ పావని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరానికి హాజరైన 42మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 15మంది ఆపరేషన్‌కు ఎంపికై నట్లు తెలిపారు. వారికి ఆపరేషన్లు చేయించి తిరిగి పెదపెంకి గ్రామానికి తీసుకు రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీఆర్ పట్నాయక్, క్యాంప్ కోఆర్డినేటర్ జోగి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం



సుభద్రలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

బలిజిపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు శుక్రవారం అక్షరాభ్యాసం జరిపించారు. అందులో భాగంగా సుభద్ర, మురగడాం, పలగర ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారుల చేత అక్షరాలు దిద్దించి పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి చిన్నారులతో కార్యక్రమాన్ని చేయించిన తరువాత విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

27న షాపుల బహిరంగ వేలం

పార్వతీపురంటౌన్: ఐడీఎస్ఎంటీ షాపులకు ఈ నెల 27న బహిరంగ వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక సంవత్సరం 2024–25కు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ఐడీఎస్ఎంటీ షాప్ రూమ్‌లలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 22, 32, 35, 44, 46 నంబర్ల షాపు రూములను గుత్త నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని తెలియజేశారు.

పశువుల్లో చర్మవ్యాధుల పరిశీలన



పశువులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పార్వతీపురంటౌన్: పశువుల్లో చర్మవ్యాధుల నివారణ నిమిత్తం సంబంధిత రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టినట్లు పశు సంవర్ధక శాఖ ఎ.డిలు బి.శ్రీనివాసరావు, చక్రధర్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురంలోని వ్యవసాయ మార్కెట్ క్షేత్రంలో పశువులను సంబంధిత వైద్యాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇటీవల జరిపిన సమీక్ష సమావేశంలో జారీ చేసిన ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒడిశా ప్రాంత పశువులకు ముద్ద చర్మవ్యాధులు సోకి మృత్యువాత పడిన ఘటనలు సంభవించిన నేపథ్యంలో వారపు సంతల్లో సమీప ఒడిశా ప్రాంతం నుంచి తీసుకువస్తున్న పశువులు వచ్చి ఆంధ్ర ప్రాంతంలో కలుస్తున్న నేపథ్యంలో చర్మ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పశువులను పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలనలో చర్మ వ్యాధుల పరిస్థితి కానరాలేదని ఒకవేళ వచ్చినంటే తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పశువుల రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామ రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీపై వరి విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయా విత్తనాలు ఏ విధంగా వేసుకోవాలి, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీఏఏ కె.విజయ్ వివరించారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నా యని, కావాల్సిన వారు ఆర్‌బీకేలను సంప్రదించాలని కోరారు.

వర్ష బీభత్సం



వెంగళరాయపురంలో పిడుగు ప్రభావానికి కాలిపోయిన విద్యుత్ మీటర్లు



వెంగాపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గేదెపద్ద



కాశీపేట సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



సాలూరు: డబ్బివీధిలో రోడ్డుపై నేలకొరిగిన చెట్టు



వెంగళరాయపురంలో పెచ్చులూడిన శ్లాబ్ లోపలిభాగం



బర్లి యూపీ పాఠశాల ఆవరణలో విరిగిన చెట్టు



సాలూరు: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నేలకొరిగిన చెట్లు



సాలూరు: మెయిన్‌రోడ్డుపై నేలకొరిగిన విద్యుత్ స్తంభం



సాలూరు: చిట్లువీధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బలిజిపేట:

మండలంలో మధ్యాహ్నం 90నిమిషాల పాటు గాలులు, పిడుగులు, వర్ష బీభత్సంతో ప్రజలు భయకంపితులయ్యారు. మధ్యాహ్నం 2గంటల 40నిమిషాల నుంచి 4గంటల 10నిమిషాల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, గాలులు, ఉరుములు, పిడుగుల ప్రభావంతో ప్రజలు కొంతమేర నష్టపోయారు. వెంగాపురంలో గంటదాలినాయుడికి చెందిన రూ.70వేలు విలువ కలిగిన గేదెపద్ద పిడుగుపాటుతో మృతి చెందింది. అలాగే వెంగళరాయపురంలో పి.లక్ష్మందొర, సింహాచలం దొరలకు చెందిన విద్యుత్ మీటర్లు పిడుగు ప్రభావంతో కాలిపోయాయి. పి.లక్ష్మందొర ఇంటి శ్లాబ్ లోపలి భాగంలో పెచ్చులూడి పడిపోయింది. బర్లి యూపీ పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు గాలి బీభత్సానికి విరిగింది. దీంతో పాటు వివిధ గ్రామాల్లో ఇన్వర్టర్లు, ఫ్రిడ్జ్‌లు పాడైనట్లు తెలిసింది. ఈ వర్ష ప్రభావంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం గడిపారు.

కాశీపేట–చినభోగిలి మధ్య కూలిన చెట్టు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలి కారణంగా రాష్ట్ర రహదారిపై కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య చెట్టు కూలిపోవడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలితో కూడిన వర్షం కురవడంతో కొమ్మలు, చెట్లు విద్యుత్ వైర్లపై పడిపోయాయి. ఈ నేపథ్యంలో కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోయినట్లు తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణమే వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ఉండే విధంగా చెట్టును పక్కకు నెట్టించడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

మక్కువలో..

మక్కువ: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులు,ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజానీకం వర్షంతో ఉపశమనం పొందారు. ఈదురు గాలుల ప్రభావానికి మండలంలోని చెముడు,కొండరేజేరు, వెంకటభైరిపురం, కొయ్యానపేట గ్రామాలలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మండలంలో అంధకారం నెలకొంది. ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న తమకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందంటూ రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సాలూరులో..

సాలూరు: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని , డబ్బివీధి, చిట్లువీధి, బంగారమ్మపేట, బంగారమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. డబ్బివీధిలో రోడ్డుపై చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు కొంతసేపు ఇబ్బంది కలిగింది. భానుని తాపంతో విలవిల్లాడిన ప్రజలకు ఈ వర్షం కొంత ఊరట ఇవ్వగా,విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పురప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలి

- ఏపీపీ వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకట రావు

పార్వతీపురంటౌన్: రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకట రావు అన్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో పార్వతీపురం మండలంలోని డోకిశీల గ్రామంలో శుక్రవారం రైతు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు సంబంధిత చట్టాలపై అవగాహన పొందాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో నాణ్యత చూడాలని, సంబంధిత బిల్లులు జాగ్రత్త చేయాలన్నారు. మోసాలకు గురైనప్పుడు చట్టాలకు అనుగుణంగా నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. రోజువారీ జీవనంలో ఎదురయ్యే అనేక సమస్యలకు చట్టపరంగా న్యాయం పొందవచ్చని, మండల న్యాయ సేవా కమిటీ న్యాయ సహాయం ఉచితంగా అందిస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ కమిటీ సభ్యులు టి.జోగారావు, ఐటీడీఏ పీఏఓ జి శ్రీనివాస రావు, వ్యవసాయ అధికారి ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



వెంకటేశ్వరస్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని లక్ష్మీతిరుమల లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల శిష్యబృందం పర్యవేక్షణలో రెండవ రోజు పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం ఎం.డి ఎన్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు లోక కల్యాణార్థం ఆలయం నిర్మించినప్పటి నుంచి ఏటా ఆరు రోజుల పాటు వందలాది మంది భక్తులతో వార్షికోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ యాజమాన్య ప్రతినిధి ఎం.సూర్యనారాయణ, కర్మాగారం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు ఘనస్వాగతం



జోగింపేట జంక్షన్ వద్ద ఎమ్మెల్యే బి విజయచంద్రకు హారతిచ్చి సత్కరిస్తున్న మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గంగమ్మ, పార్టీ కార్యకర్తలు

సీతానగరం: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు మండలంలోని పలుగ్రామాల కూడళ్ల వద్ద వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం హారతులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో పార్వతీపురం నియోజకవర్గం ముఖద్వారమైన లచ్చయ్యపేట నుంచి అంటిపేట, పణుకుపేట, కాశీపేట, ఆర్ వెంకంపేట, చిన భోగిలి, సీతానగరం, అప్పయ్యపేట, జోగింపేట, గుచ్చిమి, మరిపివలస గ్రామాల కూడళ్లలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా పాల్గొని ఎమ్మెల్యేగా ఎన్నికై సొంత నియోజకవర్గానికి వచ్చిన శుభసందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు దారి పొడవునా స్వాగతం పలికి హారతులిచ్చారు.

నర్సిపురంలో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కె.వెంకటనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో శతశాతం ఉత్తీర్ణత సాధించామని, 500 మార్కులకు పైగా 19 మందికి వచ్చాయని చెప్పారు. అత్యధిక మార్కులు 577వచ్చాయని, తమపై నమ్మకం ఉంచిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేస్తూ ర్యాలీలో పాల్గొన్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వ్యవసాయాధికారులు



ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు తెలుపుతున్న వ్యవసాయాధికారులు

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ను ఎం.రాజపురంలోని ఆయన స్వగృహంలో మండల వ్యవసాయాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు లక్ష్యాలు, సిద్ధం చేసిన విత్తనాలు, ఎరువులపై చర్చించారు. అంతకుముందు వీరంతా కలిసి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపా రు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా వ్యవసాయా ధికారి రాబర్ట్‌పాల్‌తో పాటు వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని, మండలాల వ్యవసాయాధికారులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



స్కూల్ఆఫ్ ఎక్స్‌లెన్స్ సిక్‌రూంలో విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావురావు

సీతానగరం: వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావురావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎస్ఓఈ) వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహం గదులను పరిశీలించి దోమల నివారణకు ఏమేరకు పిచికారీ చేశారో తనిఖీ చేశారు. అనంతరం వసతిగృహం పరిసరాలను పరిశీలించి వాడుక నీరు, వర్షం నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సిక్ రూం నిర్వహణ, అక్కడ ఉన్న బెడ్స్‌కు ఏర్పాటు చేసిన దోమ తెరలను, సిక్ రిజిస్టరును పరిశీలించి వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో పాటు పీహెచ్‌సీ అధికార సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించినట్లు చెప్పారు. సిక్‌రూంలో జ్వరంతో ఉన్న విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించామని జ్వరంతో ఉన్నట్లు గుర్తించడం వల్ల వైద్యసేవలు అందించనున్నామన్నారు. వసతిగృహంలో జ్వరాల బారిన పడిన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స చేసిన అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారం అందించి, జ్వరపీడితులను పీహెచ్‌సీ వైద్యసేవల నిమిత్తం తరలించాలని వైద్యసిబ్బందిని కోరారు. కార్యక్రమంలో మలేరియా శాఖ ఏఎంఓ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ బి.ధర్మరాజు, సూపర్‌వైజర్లు జయా గౌడ్, శర్మ, వైద్య సిబ్బంది లావణ్య, చంద్రినాయుడు,వసతిగృహ సిబ్బంది మీనాకుమారి, ఆశవర్కర్ పాల్గొన్నారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న గిరిజన నాయకుడు రంజిత్ కుమార్

పార్వతీపురం టౌన్: గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల గిరిజన బీఎడ్, డీఎడ్ నిరుద్యోగ అభ్యర్థులకు వసతితో కూడిన నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పోటీ పరీక్షలో గిరిజనులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు ఆశ్రయించడం వల్ల వారిపై ఆర్థిక భారంపడుతుంది కావున పూర్తిస్థాయిలో వసతితో కూడిన డీఎస్సీ శిక్షణ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, ఉర్లక నాగారు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు

పాలకొండ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేసి, వారి ప్రాణాలను కాపాడాలని పాలకొండ ప్రభుత్వ ఏరి యా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన యువత రక్తం దానం చేసి, స్ఫూర్తిని కనబరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రగాయాలపాలై రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. మనం ఇచ్చే రక్తం ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడడమే కాకుండా వారి కుటుంబాలకు పెద్దదిక్కును మిగిల్చిన వారమవుతామన్నారు. రక్తం దానం చేస్తే అనారోగ్యంపాలవుతామన్న అపోహలు వీడాలని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తం దానం చేస్తే మరింత ఆరోగ్యంగా ఉంటామని, ప్రతీ మూడు నెలలకోసారి రక్త దానం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో జె.రవీంద్రకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం



రక్తం ఇస్తున్న దాతలు

పార్వతీపురంటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించి పలువురు రక్తదాతలను సత్కరించారు. ఈ శిబిరంలో పట్టణానికి చెందిన గెంబలి గణేష్, త్రాసులు సతీష్ చంద్రలు 50వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, పార్వతీపురం కళింగ వైశ్య సంఘం సభ్యులు బోటు రామకృష్ణ 99వ సారి, గెంబలి గణేష్ 50 సార్లు, జీవితకాల సభ్యులు త్రాసుల సతీష్ చంద్ర 50 సార్లు రక్తదానం చేసినందుకు వారిని శాలువాలతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమంలో పార్వతీపురం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు బోటు రామకృష్ణ జీవితకాల సభ్యులు చుక్క చంద్రరావు, కోలా సీతారాం, బొండపల్లి వెంకటరమణ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవో 3 పునరుద్ధరణ తర్వాతే డీఎస్సీ ఇవ్వాలి

కురుపాం: జీవో నంబర్ 3 పునరుద్ధరించిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గిరిజనుల కోసం జీవో నంబర్ 3 పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో అమలు చేసి, డీఎస్సీ ప్రకటిస్తేనే గిరిజన నిరుద్యోగులకు న్యా యం జరుగుతుందన్నారు. ఏరియాలోని గిరిజన ప్రాంతాల్లో నివశిస్తున్న గిరిజన నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కురు పాం, అరకు వ్యాలీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు జీవో నంబర్ 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

గుమ్మలక్ష్మీపురం: జీవో నంబర్ 3 పునరుద్ధరణ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయికుమార్‌లు ఓ ప్రకటనలో శుక్రవా రం డిమాండ్ చేశారు. జీవో పునరుద్ధరించకుండా డీఎస్సీ నిర్వహిస్తే షెడ్యూల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com